


మన
# భానుపురి
ఇది సూర్యాపేట వార్తల ఉషాకిరణం

బుధవారం 15 జూలై 2026 | ఎడిటర్ :- బచ్చు పురుషోత్తం | పేజీలు :- 2




## నేటి నుండి శ్రీ సంతోషిమాత దేవాలయంలో వారాహి నవరాత్రి ఉత్సవము లకు ముస్తాబు

భానుపురి సూర్యాపేట కల్చరల్





ఆషాడ మాసంలో ఎంతో పవిత్రమైన శ్రీవారాహి నవరాత్రి ఉత్సవాలకు సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శ్రీ సంతోషి మాత ఆలయం ముస్తాబయింది. గత రెండు సంవత్సరాలుగా దేవాలయంలో నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. మూడవ సంవత్సరం నవరాత్రి ఉత్సవాలకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు దేవాలయ అధ్యక్షులు బ్రాహ్మణపల్లి మురళీధర్ తెలిపారు. దేవాలయ అర్చకులు బట్టారం వంశీకృష్ణ శర్మ ఆధ్వర్యంలో తొమ్మిది రోజులపాటు రోజుకో రీతిలో పూజలు నిర్వహించి ఈనెల 25 శనివారం అమ్మవారి హోమం పూర్ణాహుతి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శ్రీ వారాహి అమ్మవారిని పూజించడం వల్ల భూ సమస్యలు, శత్రు బాధలు తొలగిపోతాయని నమ్మకం. నవరాత్రి పూజలో భాగంగా 15న మహా వారాహి 16న లఘు వారాహి 17 న స్వప్న వారాహి 18న మత్స్యవారాహి 19న అశ్వరుడా వారాహి 20న బంధనవారాహి 21న ఉన్నత వారాహి 22న పంచమి వారాహి 23న దండన వారాహి 24న ధూమ్రా వారాహి గా అమ్మవారు దర్శనం ఇవ్వనున్నట్లు తెలిపారు. అంతేకాకుండా ప్రతిరోజు రాత్రి 7:30 కు సామూహిక కుంకుమార్చన పూజలు నిర్వహించి భక్తులకు అల్పాహార ప్రసాద వితరణ నిర్వహించనున్న ట్లు తెలిపారు. 11 రోజులపాటు జరిగే ఈ పూజలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ వారాహి అమ్మవారి కృపకు పాత్రులు కాగలరని తెలిపారు. ఈ కార్యక్రమ ంలో దేవాలయ ప్రధాన కార్యదర్శి పబ్బా ప్రకాశరావు కోశాధికారి కొత్త మల్లికార్జున్ కన్వీనర్ నరేంద్రని విద్యాసాగర్ రావు దేవాలయం మేనేజర్ బచ్చు పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

## వర్షపు నీటిని ఒడిసిపట్టడమే భవిష్యత్‌కు భరోసా






భానుపురి/ సూర్యాపేట టౌన్

వర్షపు నీటిని సంరక్షించడం ద్వారా భూగర్భ జలాలను పెంపొందించడంతో పాటు భావితరాలకు నీటి వనరులను భద్రపరచవచ్చని సూర్యాపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది, మున్సిపల్ కమిషనర్ హన్మంత రెడ్డి లు అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'వర్షాన్ని పట్టుకోండి' ప్రచార కార్యక్రమంలో భాగంగా సూర్యాపేట మున్సిపాలిటీ ఆధ్వర్యంలో వర్షపునీటి సంరక్షణపై సోమవారం పట్టణంలో విస్తృత అవగాహన ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది, మున్సిపల్ కమిషనర్ హన్మంత రెడ్డి ర్యాలీని ప్రారంభించి ప్రజలకు వర్షపు నీటి సంరక్షణ అవసరాన్ని వివరించారు.ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది మాట్లాడుతూ, ప్రతి ఇంటివద్ద, ప్రతి ప్రభుత్వ, ప్రైవేటు భవనంలో వర్షపు నీటి సేకరణ గుంతలను ఏర్పాటు చేయడం కాలానుగుణ అవసరమ న్నారు. వర్షపు నీటిని వృథాగా వదిలేయకుండా భూమి లోకి ఇంకేలా చర్యలు తీసుకుంటే భూగర్భ జలాలు పెరిగి, భవిష్యత్తులో తాగునీటి కొరతను అధిగమించవచ్చని తెలిపారు. ప్రతి పౌరుడు నీటి సంరక్షణను సామాజిక బాధ్య తగా భావించి వర్షపునీటి సేకరణకు సహకరి ంచాలని పిలుపునిచ్చారు.ఁమున్సిపల్ కమిషనర్ హన్మంత రెడ్డి మాట్లాడుతూ, వర్షపునీటి సేకరణ గుంతలు భూగర్భ జలాలను పునరుజ్జీవిం పజేయ డంలో కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు. వర్షపు నీటిని ఒడిసిపట్టడం ద్వారా బోర్లలో నీటి మట్టాలు పెరగడంతో పాటు భవిష్యత్ తరాలకునీటి వనరులను భద్రపరచవచ్చని పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధి లోని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, వాణిజ్య సముదా యాలు, గృహాల వద్ద వర్షపునీటి సేకరణ వ్యవస్థలను ఏర్పాటు చేయాలని ప్రజలకు సూచించారు. అనంతరం అధికారులు, ప్రజాప్రతి నిధులు కలిసి రవి మహల్ కన్వెన్షన్ హాల్, పి.ఎం. శ్రీ జెడ్పీ పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వర్షపునీటి సేకరణ గుంతలను పరిశీలించారు. వాటి నిర్మాణం, పనితీరు, ప్రయోజనాలపై ప్రజలకు వివరిం చారు. ఈ అవగాహన ర్యాలీలో వార్డు కౌన్సిలర్లు, మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డీఈ, ఎన్విరాన్ మెంటల్ ఇంజనీర్, వార్డు అధికారులు, మున్సిపల్ సిబ్బంది, విద్యార్థులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. కార్యక్రమం ముగింపులో "ప్రతి చుక్కా విలువైనదే... వర్షం ఎక్కడ పడినా, ఎప్పుడు పడినా దాన్ని పట్టుకోండి" అనే సందేశంతో ప్రజలకు నీటి సంరక్షణపై అవగాహన కల్పించారు.

## సూర్యాపేట పాత బస్టాండ్ వద్ద ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు

భానుపురి /సూర్యాపేట టౌన్




సూర్యాపేట పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో సూర్యాపేట ట్రాఫిక్ ఎస్ఐ యాడవెందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రత ట్రాఫిక్ నిబంధనలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యాపేట ట్రాఫిక్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఆటో డ్రైవర్లను ఉద్దేశించి మాట్లా డుతూ. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాల్సిన బాధ్యత ఆటో డ్రైవర్లపై ఉందన్నారు. ప్రతి ఒక్కరూ ఈ క్రింది నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని సూచించారు: ఆటో నడిపే ప్రతి డ్రైవర్ తప్పనిసరిగా ప్రభుత్వ గుర్తింపు పొందిన, చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ మరియు వాహన పత్రాలను కలిగి ఉండాలి. మద్యం సేవించి వాహనం నడపరాదు: మద్యం మత్తులో ఆటోలు నడపడం వల్ల అమాయక ప్రయాణికుల ప్రాణాలు ప్రమాదంలో పడతాయని, డ్రంక్ అండ్ డ్రైవ్‌కు దూరంగా ఉండాలని హెచ్చరించారు. జంక్షన్ల వద్ద ట్రాఫిక్ సిగ్నల్స్ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని, సిగ్నల్ జంపింగ్ చేయవద్దని స్పష్టం చేశారు. ఆటోలలో పరిమితికి మించి ప్రయాణ కులను ఎక్కించు కోకూడదని, రోడ్డుపై ఎక్కడపడితే అక్కడ ఆటోలు ఆపి ట్రాఫిక్‌కు అంతరా యం కలిగించవద్దని కోరారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలతో పాటు వాహనాలు సీజ్ చేస్తామని ఎస్ఐ తెలిపినారు.ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది స్థానిక ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

## ఘనంగా సీతారామచంద్రస్వామి వారి మాస కళ్యాణం

భానుపురి /సూర్యాపేట కల్చరల్



జిల్లా కేంద్రంలోని బొడ్రాయి బజార్ లో గల శ్రీవేదాంత భజన మందిరంలోని సీతారామ చంద్ర స్వామి వారి పునర్వసు జన్మ నక్షత్ర సందర్భంగా మంగళవారం స్వామివారి మాస కళ్యాణంను దేవాలయ అర్చకులు దరూరి సింగరాచార్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా శ్రీ సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వామి ఉత్సవ విగ్రహములకు పంచామృత అభిషేకం నిర్వహిం చారు. పట్టు వస్త్రాలు అలంకరింపజేసి, వివిధ రకాల పూలతో అలంకారం చేసి వివిధ రకాల పండ్లతో నైవేద్యం సమర్పించారు. శాస్త్రోక్తంగా కళ్యాణతంతును నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీవేదాంత భజన మందిరం అధ్యక్షులు రాచర్ల వెంకటేశ్వరరావు, కోశాధికారి సోమ అశోక్,ఈగ వెంకటేశ్వర్లు, శీలా శంకర్, సోమ సుమన్, గోదాదేవి, మౌనిక, ప్రసన్న, రేణుక, హేమలత, స్వాతి, అర్చకులు ధరూరి రాఘవాచార్యులు, మందిర మహిళా మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




## విద్యా రంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలి

భానుపురి /సూర్యాపేట టౌన్



విద్యా రంగంలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించి, పేద, వెనుకబడిన తరగతుల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని బీసీ జేఏసీ జిల్లా కన్వీనర్ భద్రబోయిన సైదులు, జిల్లా ఉపాధ్యక్షుడు బైరోజు మదనాచారి డిమాండ్ చేశారు. మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో బీసీ విద్యార్థులకు అందాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు నెలల తరబడి పెండింగ్‌లో ఉండటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. పెండింగ్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని కోరారు.ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో తాగునీరు, మరుగుదొడ్లు, గ్రీన్ చాక్‌బోర్డులు వంటి మౌలిక వసతులను మెరుగుపరచడంతో పాటు ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, అధ్యాపక పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నాయని, అలాంటి విద్యాసంస్థలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫా రాలు, నాణ్యమైన భోజనం సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం కొనసాగిస్తే బీసీ జేఏసీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ సమావేశంలో కక్కిరేణి నాగేంద్రబాబు, బూర సందీప్, సాయి, యోగేష్ తదితరులు పాల్గొన్నారు.

## సరస్వతీ పుత్రికకు 10 వేల ఆర్థిక సాయం

భానుపురి/సూర్యాపేట టౌన్



ఆర్థిక ఇబ్బందుల వల్ల చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశంతో, ప్రతి రంగంలో ప్రతిభ ఉన్న నిరుపేద విద్యార్థులకు ఆర్థిక సాయం చేయడం అభినందనీయమని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని వైట్ హౌస్ లో అక్షర ఫౌండేషన్ ఆధ్వర్యంలో యాస శృతి సౌజన్యంతో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నూతనకల్ లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థిని సప్పిడి నందినికి 10,000 ఆర్థిక సాయం ను రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా సర్వోత్తమ్ రెడ్డి గారు మాట్లాడుతూ చదువులో రాణించే వారికి, అన్ని రంగాల్లో ప్రతిభ కనబరుస్తున్న నిరుపేద విద్యార్థులకు ఆర్థిక చేయూతనందించడం హర్షణీయమని అన్నారు. వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని అన్నారు. విద్య, వైద్య, క్రీడా, సాంస్కృతిక, సామాజిక రంగాలలో విశేష సేవలందిస్తున్న అక్షర ఫౌండేషన్ ను అభినందించారు. ఈ కార్యక్రమంలో అక్షర ఫౌండేషన్ చైర్మన్ యాస రామ్ కుమార్ రెడ్డి, అధ్యక్ష కార్యదర్శులు ఉప్పు నాగయ్య, రుద్రంగి కాళిదాసు సుభాష్ చంద్రబోస్, బత్తిని ఉపేందర్, కాసర్ల సైదులు, గడ్డం వీరబాబు, ధరావత్ వీరా సింగ్, గంగాధర్, పాపయ్య మొదలగు వారు పాల్గొన్నారు.